క్లుప్తంగా

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న సిబ్బంది

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని 39వ, 40వ డివిజన్‌లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను శుక్రవారం టౌన్‌ప్లానింగ్ విభాగం సిబ్బంది తొలగించారు. నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్ ఆదేశాల మేరకు 39వ డివిజన్‌లో రోడ్డును ఆక్రమించి నిర్మించిన గోడను కూల్చివేశారు. అలాగే 40వ డివిజన్‌లో అనుమతి లేకుండా అనధికారికంగా నిర్మించిన షెడ్డును కూడా తొలగించినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఉపాధిహామీ పనుల తనిఖీ



జూలపల్లి: ఉపాధిహామీ పథకంలో చేపట్టే పనుల్లో నిబంధనలు పాటించాలని ఎంపీడీవో వేణుగోపాలరావు సూచించారు. మండలంలోని పెద్దాపూర్ బోడగుట్టపై చేపట్టిన కాంటూరు కందకాలను, నిర్మాణ పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలతలతో పాటు, నిర్ణయించిన ప్రకారం పనులు చేయాలని ఆదేశించారు. ఏపీవో సదానందం, మేట్లు ఉన్నారు.

బియ్యం అందజేత

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద పున్నం చంద్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా నేనున్నా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రఘువీర్‌సింగ్ సంస్థ తరపున బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యాన్ని సభ్యుడు పల్లె సురేశ్ ద్వారా అందజేశారు. స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఉన్నారు.

సైబర్ మోసాలపై జాగ్రత్త



అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై చక్రపాణి

జ్యోతినగర్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎన్టీపీసీ ఏఎస్సై చక్రపాణి సూచించారు. శుక్రవారం ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై బి.జీవన్ ఆదేశాల మేరకు మహిళలకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్ మోసాలకు అడ్డుకట్ట వేయడానికి చేపట్టాల్సిన అంశాల గురించి వివరించారు.

రెండు కిలోమీటర్ల మేర గుంతలు

- అధ్వానంగా ఆలయం రోడ్డు
- నిధులున్నా.. రోడ్డు నిర్మించని వైనం
- రాత్రిపూట భయంగా ప్రయాణిస్తున్న వాహనదారులు



అధ్వానంగా ఆలయానికి వెళ్లే సీసీరోడ్డు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్ న్యూమారేడుపాక గ్రామంలోని నాగులమల్లికార్జున స్వామి ఆలయానికి వెళ్లే ప్రధాన రోడ్డు ప్రమాదకరంగా మారింది. గత పాలకుల హయాంలో వేసిన సీసీ రోడ్డు ప్రస్తుతం ధ్వంసమై వాహనాలు నడవపలేని పరిస్థితి నెలకొంది. రైల్వే గేట్ నుంచి ఆలయం వరకు దాదాపు రెండు కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా మారింది. నాగుల మల్లికార్జున స్వామి ఆలయానికి వచ్చే భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

సైడ్ డ్రైనేజీ కాలువలు నిర్మించాలి

సైడ్ డ్రైనేజీ కాలువలు నిర్మించకపోవడంతో వర్షాకాలంలో వర్షం నీరు ఇళ్లలోకి వస్తున్నాయి. రోడ్డును వెడల్పు చేసి సైడ్ డ్రైనేజీ కాలువలను నిర్మించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. అంతేకాకుండా న్యూమారేడుపాక గ్రామ ప్రజలు వివిధ పనులకు వెళ్లి తిరిగి సాయంకాలం రాత్రి సమయంలో రోడ్డుపై నడవాలంటేనే జంకుతున్నారు. నూతన పాలకవర్గం వచ్చి మూడేళ్లు పూర్తి అయినప్పటికీ నిధులున్నప్పటికీ సీసీరోడ్డు నిర్మించడం లేదు. దీంతో వర్షాలకారణంగా రోడ్డుపై గుంతలు, పగుళ్లు ఏర్పడడంతో రోడ్డుపై నడవలేక పోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును పునర్ నిర్మించాలని భక్తులు, గ్రామ ప్రజలు కోరుతున్నారు.

నడవలేకపోతున్నాం



గత పాలకులు వేసిన రోడ్డు మొత్తం పగుళ్లతో గుంతలు ఏర్పడడంతో రోడ్డుపై నడువలేకపోతున్నాం. త్వరగా సీసీరోడ్డును నిర్మించాలి.

– పిడుగు రాజలింగు, న్యూమారేడుపాక

ఇబ్బందిగా ఉంది



పగుళ్లతో ఉన్న సీసీరోడ్డుపై వాహనాలు నడపాలంటేనే భయం వేస్తుంది. అంతేకాకుండా రాత్రివేళలో రోడ్డుపై వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది.

– తాళ్ల నాగరాజు, న్యూమారేడుపాక

త్వరలోనే నిర్మిస్తాం

నిధులు విడుదలయ్యాయి. త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి సాధ్యమైనంత త్వరగా సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపడతాం.

– కార్పొరేటర్, తాళ్ల అమృత రాజయ్య

ఆగని ఇసుక అక్రమ రవాణా



ఓడేడ్ ఇసుక క్వారీ



అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీ

- ఆన్‌లైన్ బుకింగ్ ఒక్కటే.. వే బిల్లులు లేకుండా రవాణా
- అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఆగని దందా

ముత్తారం: ఎన్నికవేళ అధికారులు అంతా బీజీ ఉంటారని.. ఇసుక క్వారీల నిర్వాహకులు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఒక్కటే బుకింగ్ చూపిస్తే.. నిబంధనలకు విరుద్ధంగా వే బిల్లులు లేకుండానే వందలాది లారీలు ఇసుకను అక్రమంగా రవాణా చేయడాన్ని శుక్రవారం స్థానికులు అడ్డుకున్నారు. అడ్డుకున్న లారీల ఫొటోలు సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులు టీఎస్ఎండీసీ, జిల్లా అధికారుల దృష్టికి వెళ్లడం కాసేపు నిలిపిన నిర్వాహకులు మళ్లీ ఎప్పటిలాగే నడపడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓడేడ్ నుంచి కేశనపల్లి వరకు రహదారిని ఆనుకొని ఉన్న ప్రదేశాల్లోని సీసీ కెమెరాల ఆధారంగా లారీల నంబర్లను పరిశీలిస్తే వే బిల్లులు ఉన్నాయా లేదా అనే విషయం బయట పడుతుందని, ఈ కోణంలో అధికారులు విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇసుక క్వారీ నుంచి అనుమతి లేని లారీలను సంబంధిత పర్యవేక్షకులు వెంట ఉండి మండలం దాటిస్తున్నారు. అడ్డుకున్న వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని స్థానికులు వాపోయారు. క్వారీ నిర్వాహకులు, అధికారులు కుమ్మక్కై అనుమతి లేని ఇసుక లారీల దందా నడుస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై టీఎస్ఎండీసీ పీవో రాంప్రసాద్‌ను వివరణ కోరగా వే బిల్లులు లేకుండా లారీలు నడుస్తున్నాయనే విషయం తమ దృష్టికి రాగానే క్వారీ వద్దకు తహసీల్దార్‌ను పంపించామన్నారు. పూర్తి వివరాలు తర్వాత చెప్తామని దాటవేసే సమాధానం చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోదావరిఖనిటౌన్: విద్యుత్ మరమ్మతు పనుల దృష్ట్యా శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గోదావరిఖని పీజీ సెంటర్, గౌతమీనగర్, రాంమందిర్‌ఏరియా, జనగామ విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలో 4గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ అడిచర్ల శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సుల్తానాబాద్‌లో..

సుల్తానాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా సమీపంలో ఉన్న 100కే ట్రాన్స్‌ఫార్మర్ షిఫ్టింగ్ వర్క్ చేపట్టనున్నట్లు ట్రాన్స్ కో ఏఈ రంగు శంకరయ్య తెలిపారు. ఈ మేరకు శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

బ్లాంకెట్లు, స్వెటర్లు అందజేత



బ్లాంకెట్లు అందజేస్తున్న వార్డెన్ సత్యనారాయణ

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం విద్యార్థులకు శుక్రవారం వార్డెన్ సత్యనారాయణ బ్లాంకెట్లు అందజేశారు. అలాగే స్వెటర్స్, మంకీక్యాప్స్, గ్లౌజ్‌లు, బెడ్‌షీట్స్, నోట్‌బుక్స్, స్కూల్ డ్రెస్సులు, స్కూల్ బ్యాగులు కూడా పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు



జ్యోతినగర్: పుట్టలో పాలు పోస్తున్న మహిళలు



గోదావరిఖనిటౌన్: పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



యైటింక్లయిన్‌కాలనీ: పూజలు చేస్తున్న మహిళలు



ముత్తారం: పారుపల్లి మల్లన్న ఆలయంలో..

జ్యోతినగర్/జూలపల్లి/సుల్తానాబాద్/పెద్దపల్లిరూరల్/ముత్తారం/గోదావరిఖనిటౌన్/యైటింక్లయిన్ కాలనీ/కాల్వశ్రీరాంపూర్: మండల జిల్లావ్యాప్తంగా శుక్రవారం నాగులచవితిని మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పుట్టకు ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమతో పాటు ఉల్లిగడ్డ పాలు, పెరుగు, పలు రకాల నైవేద్యాలను సమర్పించారు. నాగుల చవితి సందర్భంగా ఆలయాలు కిటకిటలాడాయి. కొన్ని ప్రాంతాల్లోని ఆలయాల్లో అన్నదానం చేశారు.

డీసీసీ కార్యదర్శిగా కత్తెరమల్ల రమేశ్



జ్యోతినగర్: కాంగ్రెస్ కమిటీ జిల్లా కార్యదర్శిగా ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణ కాలనీకి చెందిన కత్తెరమల్ల రమేశ్‌ను నియమించారు. డీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ రామగుండం అసెంబ్లీ అభ్యర్థి మక్కాన్‌సింగ్ నియామక ఉత్తర్వులు అందించారు.

ఓటు ప్రాధాన్యంపై కళాజాత ప్రదర్శన

రామగుండం: ఓటు హక్కు ప్రాధాన్యంత, ప్రజాస్వామ్యంలో ఓటు విలువ తదితర అంశాలపై కళాజాత బృందం ప్రదర్శనలు ఇచ్చింది. ఇందులో భాగంగా శుక్రవారం రైల్వేస్టేషన్ ప్రాంగణం, అక్బర్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఓటు ప్రాధాన్యంపై సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో మెప్మా సీఓలు, మున్సిపల్ సిబ్బంది, ఆశ, ఆర్పీలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్‌లో కళాజాత ప్రదర్శన

బీఆర్‌ఎస్ పాలనపై ప్రజలు విసుగు చెందారు

- కాంగ్రెస్ పెద్దపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి విజయరమణారావు



పెద్దపల్లిరూరల్: పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ పెద్దపల్లి అభ్యర్థి విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనపై ప్రజలు విసుగు చెందారని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే అండగా నిలవాలని వారు నిర్ణయం తీసుకున్నారని కాంగ్రెస్ అభ్యర్థి విజయరమణారావు అన్నారు. బొంపల్లి సర్పంచ్ అరికిల్ల లక్ష్మయ్య తదితరులు బీఆర్‌ఎస్‌ను వీడి శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి ఆహ్వానించారు. నాయకులు రాజయ్య, పెగడ రమేశ్, తుల మనోహర్‌రావు, ఎడెల్లి శంకర్ పాల్గొన్నారు. కాగా, పట్టణంలోని పలు వార్డుల్లో కాంగ్రెస్ మాజీ ప్రజాప్రతినిధులు సందన వేన సునీత, యాట దివ్య, ఈర్ల స్వరూప తదితరులు ఇంటింటి ప్రచారం నిర్వహించి కాంగ్రెస్‌నుగెలిపించాలని కోరారు.

ఐటీఐ మైదానంలో ప్రచారం..

ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తున్న తనకు ఈసారి ఓటు వేసి ఒక్క అవకాశం కల్పించాలని కాంగ్రెస్ అభ్యర్థి విజయరమణారావు కోరారు. ఐటీఐ మైదానంలో వాకర్స్‌తో కలిసి ఓట్లు అభ్యర్థించారు. నాయకులు ఉప్పు రాజు, కొమ్ము సుధాకర్, సునీల్, రంగు శ్రీను, సుభాష్‌రావు, జగదీశ్ పాల్గొన్నారు.

ఎలిగేడులో..

ఎలిగేడు: విజయరమణారావును గెలిపించాలని కోరుతూ సర్పంచ్ సింధూజ మహిళలతో కలిసి బీడీలు చుడుతూ ఎన్నికల ప్రచారం చేశారు.

జూలపల్లిలో..

జూలపల్లి: పేదల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని విజయరమణారావు అన్నారు. బాలరాజుపల్లె, కీచులాటపల్లెలో ఆయన ఇంటింటా ప్రచారం చేశారు. చేతిగుర్తుకు ఓటువేయాలని కోరారు. నాయకులు వేణుగోపాలరావు, నర్సింహయాదవ్, తిరుపతి పాల్గొన్నారు. కాచాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు కందుకూరి సంజీవ్, అజలీ, కీచులాటపల్లెకు చెందిన కొత్త సురేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే సతీమణి పావని జూలపల్లి, కుర్మపల్లెలో ప్రచారం చేశారు.



కరచాలనం చేస్తున్న విజయరమణారావు

సుల్తానాబాద్: విజయరమణారావుకు మద్దతుగా మాజీ సర్పంచ్ అంతటి అన్నయ్యగౌడ్ విస్తృత ప్రచారం చేశారు.

సింగరేణిలో పెరిగిన రాజకీయ జోక్యం



కార్మికులతో మాట్లాడుతున్న మక్కాన్‌సింగ్



జనగామలో ప్రసంగిస్తున్న మక్కాన్‌సింగ్

- కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మక్కాన్‌సింగ్

గోదావరిఖని: బీఆర్‌ఎస్ హయాంలో సింగరేణిలో రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగి కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజ్‌ఠాకూర్ విమర్శించారు. సింగరేణి కార్మికుల దీవెనయాత్రలో భాగంగా శుక్రవారం జీడీకే–2ఏ గనిపై మాట్లాడారు. టీబీజీకేఎస్ కార్మికుల సమస్యలను పరిష్కారంలో విఫలమైందన్నారు. చేతి గుర్తుకు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్, నాయకులు పెంచాల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ వైద్యం ఏమైంది?

సీఎం కేసీఆర్ చెప్పిన సూపర్ స్పెషాలిటీ వైద్యం ఏమైందని రాజ్‌ఠాకూర్ ప్రశ్నించారు. ఏరియా హాస్పటల్ సందర్శించి చికిత్స పొందుతున్న కార్మిక కుటుంబ సభ్యులను కలిసి చేతిగుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు.

కుటుంబాలకు అండగా ఉంటా..

లారీ యజమానులు, డ్రైవర్లు, క్లీనర్ల కుటుంబాలకు అండగా ఉంటానని రాజ్‌ఠాకూర్ అభయం ఇచ్చారు. స్థానిక గంగానగర్‌లో రామగుండం లారీ యజమానులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం అశోక్‌నగర్ మసీదుల మైనార్టీల ఓట్లు అభ్యర్థించారు.

మోసం చేసిన ఎమ్మెల్యే

జనగామను దత్తత తీసుకుంటానని ఎమ్మెల్యే చందర్ ప్రజలను మోసం చేశారని ఎంఎస్ రాజ్‌ఠాకూర్ విమర్శించారు. జనగామలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు.

ఇంటింటా ఓటరు జాబితా పరిశీలన

రామగుండం: కార్పొరేషన్ ఒకటో డివిజన్ పరిధిలోని ఎ కాలనీ 27వ బూత్ పరిధిలో శుక్రవారం కాంగ్రెస్ ప్రతినిధులు ఇంటింటా పర్యటిస్తూ ఓటరు జాబితాలో పేర్లను పరిశీలించారు. జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మక్కాన్‌సింగ్‌ఠాకూర్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రతినిధులు హరిప్రసాద్ ఉన్నారు.

కాంగ్రెస్ నేతల మాటలు నమ్మొద్దు

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు



మహదేవపూర్: పుట్ట మధుకు మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

మంథని/కాళేశ్వరం/మహదేవపూర్/మల్హర్: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మొద్దని మంథని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధుకర్ కోరారు. మంచిర్యాల జిల్లాలో శుక్రవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి కేటీఆర్‌ను మధు కలుసుకున్నారు కాగా మహదేవపూర్ మండలం అన్నారం, నాగేపల్లి, మద్దులపల్లి, పలుగుల, కుంట్లంలో మధు ప్రచారం చేశారు. సర్పంచులు శ్రీపతి బాపు, లస్మయ్య, సురేందర్, వసంత, శ్రీనివాసరావు, అన్కారి ప్రకాశ్, మక్బూద్, యూత్ నాయకులు అలీంఖాన్, గీతా, సుజాత ఉన్నారు. కాగా, నాగేపల్లి ఎన్నికల ప్రచారంలో పుట్ట మధు కారును గ్రామస్తులు అడ్డుకొని నిరసన తెలిపారు. సరస్వతీ(అన్నారం)బ్యారేజీ బ్యాక్‌వాటర్‌తో ఏటా పంటలు నష్టపోతున్నామని వాగ్వాదానికి దిగారు. మల్హర్ మండలం ఇప్పలపల్లికి చెందిన మల్లేశ్, పెద్దమల్లయ్య, నవీన్, చింటూ, మహేశ్, ఓంకార్, కుమార్ బీఆర్‌ఎస్‌లో చేరారు.

బీసీ బిడ్డను గెలిపించాలి

ముత్తారం: మంథనిలో బీసీ బిడ్డ పుట్ట మధూకర్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లివెల్లి శంకర్ కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు.

ఇంటింటా ప్రచారం

మంథని: బీఆర్‌ఎస్ అభ్యర్థి పుట్ట మధుకు ఓటు వేసి గెలిపించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ మున్సిపల్ పరిధి నాలుగో వార్డులోని ఓటర్లను కోరారు. గంగాపురిలో ఇంటింటా ప్రచారం చేశారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

రామగిరి: మండలంలోని రత్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపూర్‌కు చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. కాగా వారికి మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మంథని ఎమ్మెల్యేగా పుట్ట మధు గెలవాలని పాస్టర్ సిమాన్ బాబు ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు.



మంథని: పరదా కుడుతున్న పుట్ట శైలజ

సంక్షిప్త వార్తలు

➡ ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ

ఓదెల: ఓదెల తహసీల్ కార్యాలయంలో ఓటరు గుర్తింపు కార్డులను బీఎల్వోలకు సీనియర్ అసిస్టెంట్ వైశాలీ శుక్రవారం పంపిణీ చేశారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో ఓటుహక్కును సద్వినియోగం చేసుకునే 22గ్రామాల ఓటర్ల గుర్తింపు కార్డులను సీనియర్ అసిస్టెంట్ బీఎల్వోలకు అందజేశారు.

➡ అయ్యప్ప ఆలయంలో గణపతి హోమం

జ్యోతినగర్: అయ్యప్ప ఆలయంలో గణపతి హోమం కనుల పండువగా నిర్వహించారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలోని చిలుకలయ్య ఆలయంలోని అయ్యప్ప ఆలయంలో అర్చకులు నర్సింహశర్మ శాస్త్రోక్తంగా కార్తీక మాసంలో అయ్యప్ప పూజలు చేశారు.

➡ ఓదెలలో స్వయం పరిపాలన దినోత్సవం

ఓదెల: మండలంలోని ఓదెల, పొత్కపల్లి హైస్కూల్లో స్వయం పరిపాలన దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. హెచ్ఎంగా సాహితి, డీఈవోగా అక్షిత, ఎంఈవోగా తేజశ్విని వ్యవహరించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతి అందించారు.

➡ సౌభాగ్యం కోసం వాయినాలు

సుల్తానాబాద్: పట్టణంలోని శివాలయంలో స్వామివారికి రుద్రాభిషేకం చేశారు. శుక్రవారం మహిళలు వాయినం ఇచ్చిపుచ్చుకున్నారు. వేణుగోపాలస్వామి ఆలయంలో కార్తీక దీపం ప్రతిష్ఠించిన తర్వాత వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. కార్తీక పౌర్ణమి విశిష్టత తెలిపేలా ప్రచారం చేయనున్నట్లు పూజారి రమేశ్ తెలిపారు.

కవిత సభను విజయవంతం చేయండి

రామగిరి: సెంటినరీకాలనీలో 19న జరిగే టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్యే కవిత సభను విజయవంతం చేయాలని మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ కోరారు. శుక్రవారం సెంటినరీకాలనీ వాణి సెకండరీ పాఠశాలలోని సభాస్థలిని ఆమె పరిశీలించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శంకేశీ రవీందర్, ఆర్జీ–3 టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, పన్నూర్, రత్నాపూర్ సర్పంచ్‌లు అల్లం పద్మ, పల్లె ప్రతిమ నాయకులు దర్ముల రాజసంపత్, జక్కుల దామోదర్‌రావు, పింగిలి సంపత్‌రెడ్డి, భాస్కర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆంగ్ల బోధనపై పట్టు సాధించాలి



ఆంగ్ల బోధనపై మాట్లాడుతున్న అధికారి

జూలపల్లి: ఉపాధ్యాయులు ఆంగ్ల బోధనపై పట్టు సాధించాలని జిల్లా అసిస్టెంట్ మానిటరింగ్ అధికారి పీఎం షేక్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ధర్మారం, సుల్తానాబాద్, ఎలిగేడు, జూలపల్లి నాలుగు మండలాల ఆంగ్ల పాఠ్యాంశ ఉపాధ్యాయులకు ఒకరోజు ఆంగ్లం బోధన, ఉన్నతిపైన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న జిల్లా అధికారి షేక్ మాట్లాడుతూ సులభతర విద్యాబోధనలతో విద్యార్థులకు అవగాహన కలిగి పట్టు పెంచుకుంటారని పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమంలో ఎంఎన్‌వో సరస్వతి, ప్రధానోపాధ్యాయులు లక్ష్మన్, ఉపాధ్యాయులు ఉన్నారు.